ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



17న పాలకొండలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): పాలకొండలో సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్‌సీ పాసైన విద్యార్థులు, 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 1050 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. ఇతర వివరాలకు ఈ 63012 75511, 79937 95796 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పురపాలన అస్తవ్యస్తం



సాలూరు మున్సిపల్ కార్యాలయం

- పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం
- మొక్కుబడిగా సర్వసభ్య సమావేశాలు
- మంజూరైన నిధులు వెనక్కి..
- పనులు పూర్తిచేయలేక పోయిన గత వైసీపీ ప్రభుత్వం
- అభివృద్ధికి నోచని సాలూరు మున్సిపాల్టీ
- సమస్యలతో ప్రజలు సతమతం
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

సాలూరు, సెప్టెంబరు 10: సాలూరు మున్సిపాల్టీలో పాలన గాడి తప్పింది.. అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి అటకెక్కింది. మున్సిపల్ సర్వసభ్య సమావేశాలు సైతం మొక్కుబడిగా సాగుతున్నాయి. కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు స్వపక్షంలో విపక్షంగా మారగా.. అధికారులు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాల్టీ ఏమైతే తమకేంటి? అనే ధోరణిలో ఉన్నారు. ఏదోలా ఉద్యోగం చేసేసి మమ అనిపిస్తున్నారు. మున్సిపాల్టీ ఆదాయంపై దృష్టి సారించడం లేదు. మరికొంత మంది అధికారులైతే 'ఏదో వచ్చాం.. వెళ్తున్నాం' అన్నట్లుగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. మున్సిపాల్టీలో ప్రధానంగా రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజనీరింగ్, పారిశుధ్యం తదితర విభాగాలపై పర్యవేక్షణ కొరవడింది. నిధులున్నా పట్టణంలో ఎలాంటి పనులు జరగడం లేదు. దీంతో గత మూడేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని వారు అధికా రులు, పాలకవర్గాన్ని కోరుతున్నా.. ఎటువంటి ఫలితం ఉండడం లేదు. మొత్తంగా పురపాలన అస్తవ్యస్తంగా మారింది.

నిధులున్నా.. పూర్తవ్వని పనులు

సాలూరు మున్సిపాల్టీలో 29 వార్డులున్నాయి. అధికారికంగా సుమారు 50వేల వరకు జనాభా ఉన్నారు. అయితే వారంతా పారిశుధ్యం, తాగునీటి సమస్యలతో సతమతమవుతున్నారు. కాగా మున్సిపాల్టీలో నిధులు లేక పనులు జరగకపోవడం సర్వసాధారణం. కానీ పట్టణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తవకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొర జరిగిన నిర్మాణాలకు కూడా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. అంతేకాదు మున్సిపాల్టీలో పలు పనులకు ఐదు నుంచి పదిసార్లు టెండర్లు పిలిచినా వారు ముందుకు రావడం లేదు. ఇదిలా ఉండగా పురపాలక ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన డంపర్ బీన్లు పూర్తిగా పాడయ్యాయి. వాటి కొనుగోలుకు నిధులు కేటాయించి రెండేళ్లయినా నేటికీ కొత్తవి రాలేదు. మొత్తంగా గత వైసీపీ ప్రభుత్వ వైఖరి, అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా పట్టణం కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం మున్సిపాల్టీ వాసులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.


మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

రూ.4.31 కోట్లు వెనక్కి..

మున్సిపాల్టీకి 14వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సక్రమంగా పనులు చేపట్టలేదు. దీంతో మంజూరైన నిధుల్లో రూ.6.50 కోట్లు మిగిలిపోయాయి. దానిలో రూ.2.20 కోట్లను వీధి దీపాల విద్యుత్ చార్జీల బకాయిలకు మళ్లించారు. గడువు పూర్తవడంతో మిగిలిన రూ.4.31 కోట్లు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో పట్టణంలో ప్రతిపాదించిన సుమారు 119 పనులు జరగలేదు.

15వ ఆర్థిక సంఘం నిధులు ఇలా..

మున్సిపాల్టీకి ఇప్పటివరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.9.58 కోట్లు వరకు మంజూరయ్యాయి. మొత్తంగా 94 పనులు ప్రతిపాదించారు. రూ.2.12 కోట్లతో 33 పనులు పూర్తి చేశారు. ఈ ఏడాది రెండో విడతగా రూ.160.98 లక్షలు మంజూరవగా.. గతంలో చేపట్టిన పనులకు సీఎఫ్ఎంఎస్ ద్వారా రూ.29.22 లక్షలు చెల్లించారు. మిగిలిన నిధులతో వివిధ పనులకు ప్రతిపాదలు చేయాల్సి ఉంది. అయితే ఈ దశలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కొంతమంది సిబ్బంది బదిలీపై వెళ్లిపోయారు. మరికొంతమంది రిలీవ్ ఆర్డర్ కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

షాపుల పరిస్థితి ఇదీ..

ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మీడియం టౌన్స్‌లో భాగంగా 2006, 2016లో మున్సిపల్ కార్యాలయం సమీపంలోనే 30 షాపులు నిర్మించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో 19 దుకాణాలను అద్దెకు ఇచ్చారు. అయితే 2019 తర్వాత సీన్ మారింది. షాపుల నిర్వాహకులపై అద్దెలతో పాటు జీఎస్టీ, ఇతరత్రా అదనపు భారం వేశారు. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వచ్చినా కొంతమంది అధికారులు వెనక్కి తగ్గలేదు. అంతేకాదు జీఎస్టీ పేరిట వసూలు చేసిన మొత్తం ప్రభుత్వానికి చెల్లించలేదు. దీంతో షాపుల్లో అద్దెకుంటున్న చిరు వర్తకులు మళ్లీ జీఎస్టీని చెల్లించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా 2022 నుంచి షాపులకు సంబంధించి నిర్వాహకులతో ఎలాంటి అద్దెలు కట్టించుకోవడం లేదు. రెన్యూవల్ కూడా చేయకపోవడంపై వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దె చెల్లించకపోయినా..

ఇదే షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ దుకాణం నుంచి ఎలాంటి అద్దె వసూలు చేయడం లేదు. వాస్తవంగా 2017లో ఓ ప్రైవేట్ వ్యక్తి ఆ షాపును అద్దెకు తీసుకుని రీ మోడల్ చేసుకున్నాడు. అయితే అప్పటి నుంచి ఆయన మున్సిపాల్టీకి ఒక్క పైసా కూడా అద్దె చెల్లించడం లేదు. అయినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అను మానాలు వ్యక్తమవుతున్నాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లో మరో పది షాపులు నిరుపయోగంగా మారడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

వారి నిర్లక్ష్యమే కారణం..

సాలూరు మున్సిపాల్టీలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్ల గత మూడేళ్లలో ఎలాంటి పనులు జరగలేదు. వారి బాధ్యతా రాహిత్యం కారణంగా 14, 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో పట్టణం అభివృద్ధికి నోచుకోలేదు.

-గిరి రఘు, వైసీపీ కౌన్సిలర్, సాలూరు

పట్టించుకోలేదు..

సాలూరు మున్సిపాల్టీని గత మూడేళ్లలో అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో కొబ్బరికాయలు కొట్టడం తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసిన తాగునీటి పైలాన్ దిష్టిబొమ్మలా మారింది.

-వి.హర్షకుమార్, టీడీపీ కౌన్సిలర్, సాలూరు

పనుల పూర్తికి చర్యలు..

మున్సిపాల్టీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కొత్తగా మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు పిలుస్తాం.

-సూరినాయుడు, ఏఈ, సాలూరు

ప్రజల దరికి పైడిమాంబ రథం

- అమ్మవారి పండగ విశిష్టత తెలియజేయడమే లక్ష్యం


పైడిమాంబ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 10: కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడిమాంబ విశిష్టత, సిరిమాను పండగ సన్నద్ధతపై ప్రజలకు తెలియజేసేందుకు ప్రచారం రథం బయలుదేరింది. పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు తిరిగే రథాన్ని ఎమ్మెల్యే అదితిగజపతిరాజు మంగళవారం చదురుగుడి వద్ద ప్రారంభించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, సింహాచలం వరహాలక్ష్మీనరసింహా స్వామి ఆలయాల వద్ద కూడా ఒక్కో రోజు ఉండి పండగపై ప్రచారం చేయనున్నారు. ఆలయ ఈవో డీవీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఏటా సిరిమానోత్సవానికి ముందు ఈ ప్రచార రథం ఊరూరా తిరిగి పండగపై విస్తృత ప్రచారం చేస్తుందన్నారు. పందిరి రాట, మండల, అర్ధమండల దీక్షలు, సిరిమాను ఎంపిక, తీసుకురావడం తదితర ప్రక్రియలన్నీ సంప్రదాయబద్ధంగా ఒకటి తరువాత మరొకటి జరుగుతాయన్నారు. కాగా పైడిమాంబను మంగళవారం చదురుగుడిలో పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు.

కాజ్‌వేపై వరదను దాటి.. స్కూల్‌కు చేరి..

- ఏళ్లు గడుస్తున్నా పూర్తవ్వని శివరాంపురం వంతెన
- విద్యార్థులకు తప్పని వెతలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 10: సాలూరు మండలం శివరాంపురం వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఏటా వర్షాకాలంలో సాహసం చేయాల్సి వస్తోంది. కాజ్‌వేపై మోకాళ్ల లోతు వరద నీటిలో నుంచి నడుచుకుని పాఠశాలలకు చేరుకోవాల్సి వస్తోంది. తాజాగా మంగళవారం చినపారన్నవలసకు చెందిన విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్లు నడిచి.. కాజ్‌వేలో వరదను దాటుకుని శివరాంపురంలో స్కూల్‌కు చేరారు. అయితే దీనిపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తికాక పోవడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని , కాజ్‌వేపై వరద దాటుకుని తిరిగి పిల్లలు ఇళ్లకొచ్చేవరకూ టెన్షన్ తప్పడం లేదని వారు వాపోతున్నారు. కాగా శివరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 186 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే చిన్న పారన్నవలస, పెదపారన్నవలసకు చెందిన 23 మందికి ఇక్కట్లు తప్పడం లేదు. చిన్నపారన్నవలస విద్యార్థులు కాజ్‌వేను దాటుకుని పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో వర్షాకాలంలో వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న రోజున వారు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. పెద పారన్నవలస విద్యార్థులైతే రెండు సార్లు వేగావతి నదిని దాటాల్సి వస్తోంది. వర్షాకాలంలో అయితే ఉత్తర వైపు ఉన్న కూరగెడ్డను దాటి రైల్వే ట్రాక్ మీదుగా ఐదు కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు చేరాల్సి వస్తోంది.


కాజ్‌వేపై వరదలో నడిచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

పనులు పూర్తయితే..

ఈ వంతెన నిర్మాణానికి 2007లో అప్పటి కాంగ్రెస్ మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్లతో పనులు ఆరంభించారు. కోటి రుపాయలతో పిల్లర్లు వేశారు. అయితే ఆ తర్వాత వివిధ కారణాలతో పనులు నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మాణనికి మోక్షం లభించడం లేదు. దీనిపై పలు విమర్శలు రావడంతో ఎన్నికల ముందు గతవైసీపీ ప్రభుత్వం రూ. 5.95 కోట్లు మంజూరు చేసింది. అయితే టెండర్లు మాత్రం పిలువ లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని శివరాంపురం, పెదపారన్నవలస, చినపారన్నవలస, రొంగడివానివలస, రొంపల్లి తదితర గ్రామస్థులు కోరుతున్నారు. వంతెన పనులు పూర్తయితే విద్యార్థులు, రైతులు, గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందుల తప్పుతాయని వారు చెబుతున్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యాటక దినోత్సవానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలన్నారు. సీతంపేటలో ఆడలి వ్యూ పాయింట్‌ను పర్యాటకంగా బాగా అభివృద్ధిచేయాలని ఆదేశించారు. గిరిజన మ్యూజియం పనులు వేగవంతం చేయాలని తెలిపారు. శంబర పోలమాంబ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు గాను ప్రధాన వీధిలో ఆక్రమణలు తొలగించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని ప్రతి గ్రామాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బెనరాయ్ వాటర్ ఫాల్స్ వద్ద రూ.40లక్షలతో, పొల్ల వ్యూ పాయింట్ వద్ద రూ.12 లక్షలతో, సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్ వద్ద రూ.70 లక్షలతో పనులు చేపడుతున్నామని డీఎఫ్‌వో ప్రసూన వెల్లడించారు.

సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలి..

పీఎం సూర్యఘర్ సబ్సిడీ వినియోగించుకొని ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. రానున్న మూడు నెలల్లో వెయ్యి కిలో వాట్ల సోలార్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఇంటిపై సోలార్ యూనిట్ పెట్టడానికి అవకాశం ఉన్న ఇళ్లను గుర్తించి సచివాలయ సిబ్బంది ద్వారా వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ.. వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 121 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 16 మంది రూ.1300 చెల్లించారన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


కోటదుర్గమ్మ ఉత్సవాలకు సన్నాహాలు

- దసరా ఏర్పాట్లపై నిర్వాహక సమావేశం

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాలు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఈ ఏడాది దసరా ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, క్యూలైన్లు, ట్రాఫిక్, అన్నదానంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ఉత్సవ కమిటీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో తోటపల్లి, శంబర దేవస్థానాల ఈవో సూర్యనారాయణ, ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, ఎమ్మెల్సీ విక్రాంత్, సీఐ చంద్రమౌళి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

16 వసతి గృహాలకు.. ఏడుగురే!




ఇన్‌చార్జి పాలనలో నడుస్తున్న చినమేరంగి ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహం

- బీసీ హాస్టళ్లకు సంక్షేమాధికారుల కొరత
- ఒక్కొక్కరిపై మూడు అంతకంటే ఎక్కువ వసతి గృహాల బాధ్యతలు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- గాడి తప్పుతున్న మెనూ
- ఐదేళ్లలో భర్తీకి చర్యలు చేపట్టని వైసీపీ ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

జియ్యమ్మవలస: జిల్లాలో వెనుకబడిన తరగతుల వసతి గృహాలకు సంక్షేమాధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత ఐదేళ్లుగా ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది. 'మన్యం'లోని 16 వెనుకబడిన తరగతుల వసతి గృహాలకు ఏడుగురు సంక్షేమాధికారులే ఉన్నారు. ఒక్కొక్కరూ మూడు అంతకంటే ఎక్కువ హాస్టళ్లను చూసుకోవాల్సి వస్తోంది. దీంతో పర్యవేక్షణ కొరవడగా.. నిర్వహణ, మెనూ గాడి తప్పుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నియామకాలకు చర్యలు చేపట్టకపోవడంతో వసతిగృహాలకు ఇన్‌చార్జిలే దిక్కుగా మారారు. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో జియ్యమ్మవలస, రావివలస, చినమేరంగి, కురుపాం, గరుగుబిల్లి, పార్వతీపురం (గర్ల్స్), పార్వతీపురం (బాలురు), నర్సిపురం, బూర్జ, పాచిపెంటలో పది బీసీ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో 3 నుంచి 10వ తరగతుల వరకు 496 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్, పాలిటెక్నికల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం పాలకొండ, చినమేరంగి (బాలురు), చినమేరంగి (బాలికలు), పార్వతీపురం (బాలురు), పార్వతీపురం (బాలికలు), సాలూరు (బాలురు)లో పోస్ట్ మెట్రిక్ బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో 387 మంది విద్యార్థులు ఉన్నారు. కాగా 16 వసతి గృహాలకు 16 మంది సంక్షేమాధికారులు ఉండాలి. కానీ ఏడుగురు మాత్రమే ఉన్నారు. గత ఐదేళ్ల నుంచి ఇదే పరిస్థితి. దీంతో ఉన్న వారికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయకపోవడంతో చివరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వార్డెన్‌ను జిల్లాలో ఓ బీసీ వసతి గృహానికి ఇన్‌చార్జిగా నియమించారు.

అడ్జెస్టిమెంట్ ఇలా...

- పాలకొండ బాలురు కాలేజీ హాస్టల్‌కు సీతంపేట టీడబ్ల్యూఏ స్కూల్ సంక్షేమాధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- సాలూరు బాలికల వసతి గృహంలో రెగ్యులర్‌గా పనిచేస్తున్న ప్రమీల అనే సంక్షేమాధికారినిని పాచిపెంట బాలుర వసతి గృహానికి ఇన్‌చార్జిగా నియమించారు.
- పార్వతీపురం బీసీ హాస్టల్ సంక్షేమాధికారి ఎస్.సాంబయ్యకు బూర్జ, నర్సిపురం బీసీ హాస్టళ్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మొత్తంగా ఆయన మూడు వసతి గృహాలను పర్యవేక్షించాల్సి ఉది.
- చినమేరంగి కాలేజీ హాస్టల్ సంక్షేమాధికారిణి ఎస్.సభద్రకు చినమేరంగి బాలికలు, పార్వతీపురం బాలికల కాలేజీ వసతి గృహాలకు ఇన్‌చార్జిగా నియమించారు.
- రావివలస బీసీ హాస్టల్‌కు నాగేశ్వరరావు, పార్వతీపురం బాలికల హాస్టల్‌కు పి.పద్మజ, బాలురు హాస్టల్‌కు హారిక రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు.
- గరుగుబిల్లి బీసీ వసతి గృహ సంక్షేమాధికారి ఎన్.శ్రీనివాసరావుకు జియ్యమ్మవలస, చినమేరంగి, కురుపాం వసతి గృహాలకు ఇన్‌చార్జిగా నియమించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాలకు ఒక్క అధికారి ఎలా వెళ్లగలరు.. ఎలా పర్యవేక్షించగలరన్నది ఉన్నతాధికారులకే తెలియాలి. దీనిపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

భర్తీకి సన్నాహాలు..

వసతి గృహాల్లో సంక్షేమాధికారుల కొరత విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. మెగా డీఎస్సీతో కచ్చితంగా భర్తీ చేస్తామని చెప్పారు. అంతవరకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

-ఎస్.కృష్ణ, ఇన్‌చార్జి డీబీసీడబ్ల్యూవో, పార్వతీపురం మన్యం

(నిన్నటి దిక్సూచి తరువాయి)



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలులోకి వస్తుంది.

● ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

● బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

● అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.

● అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: ● passed Class 10 from a local government school. ● passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And ● enrolled in a full-time graduate programme starting in 2024-25.

● Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. ● Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum

Last Date to Apply: 23-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT
Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

● Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024

Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాలఅడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.

కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

● ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.

● చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.

● నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రాజ్, నాజర్ వంటి సీనియర్స్‌తో కలసి నటించడం వల్ల చాలా నేర్చుకున్నాను. దర్శకుడు అర్జున్ సాయి తన తొలి సినిమాకు ఇలాంటి గొప్పకథను ఎన్నుకోవడం, ఆయనకు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ సపోర్ట్ ఇచ్చి సినిమాను విడుదల చేయడం హ్యాపీగా అనిపిస్తోంది.

● నా తొలి సినిమా 'ఎస్.ఎం.ఎస్.' చేస్తున్నప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నాను. అందుకే ఇన్నాళ్లూ విభిన్న పాత్రలు చేస్తూ వచ్చాను. అన్ని రకాల పాత్రలు చేయడమే నా గోల్

కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు





ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్య'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు




అందర్నీ తెగ నవ్వించాయి. పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలో విడుదలై అందరినీ అలరిస్తోంది.



వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతేకాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చందేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.



మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంచైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి దిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం



మలయాళ హీరో టోవిన్ థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రండం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

నీట మునిగిన పంటలు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు

జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వందలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి నీరు నిల్వఉండడం వల్ల పైరు కుళ్లిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రామభద్రపురం మండలంలో పారాది బట్టి పొంగి పొర్లడంతో శిష్టు సీతారాంపురంలో వరిపంట ముంపు బారిన పడింది. విజయనగరం మం డలంలోని గుంకలాంలోని రెండు చెరువులు పొంగిపొర్లడంతో నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఆ నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. దీనికితోడు రోడ్లపై ఏర్పడిన గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


రామభద్రపురం: శిష్టు సీతారాంపురంలో నీట మునిగిన వరిపైరు


బాడంగి: గోతులమయమైన భీమవరం రహదారి


బొబ్బిలి: కాలేజీ రోడ్డులో చేరిన నీరు


విజయనగరం రూరల్: గుంకలాం వద్ద పంట పొలాల్లోకి వెళ్తున్న వరద నీరు


కొత్తవలస: కె.కోటపాడులో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష

గంట్యాడ: ఓ మహిళను పెళ్లి చేసుకుంటామని నమ్మించి, మోసం చేసి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.35 వేలు జరిమాన విధిస్తూ కోర్టు తీర్పుఇచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి 2018లో అదే గ్రామానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటున్నానని నమ్మించి మోసంచేసి అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు వచ్చింది. అప్పట్లో ఎస్ఐ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టుకు అప్పగించారు. దీంతో అత్యాచారం చేసినట్లు రుజువుకావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమాన విధిస్తూ మహిళా కోర్టు ఐదో ఏడీజే న్యాయాధికారి పద్మావతి తీర్పుఇచ్చారు.

సంతపాలెంలో 108 పశువులు స్వాధీనం

కొత్తవలస: అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 108 పశువులు, రెండు వాహనాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిని సీఐ షణ్ముఖరావు అరెస్టు చేశారు. సీఐ షణ్ముఖరావు కథనం మేరకు.. సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో కలిసి సంతపాలెం శివారున ఉన్న గోదాములో సీఐ దాడిచేశారు. ఈసందర్భంగా 108 పశువులను బంధించి, రవాణా చేయడానికి సిద్ధంచేసినట్లు గుర్తించారు. ఈమేరకు అక్రమ రవాణా పాల్పడుతున్న సంతపాలెం గ్రామానికి చెందిన గొటివాడ ఎర్రిబాబు, గొటివాడ నవీన్, ఇందుగుబిల్లి దేముళ్లను అరెస్టుచేశారు.

వరదలోనూ ఇసుక తవ్వకాలు

- అలజంగిలో నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం


అలజంగి వద్ద వేగావతి నదిలో వరదలోనూ ఇసుక ట్రాక్టర్లపై లోడ్‌చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి వద్ద వేగావతి నది నుంచి అనుమతి లేకుండా రాత్రివేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. వారం రోజులుగా భారీ వర్షాలతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినా కొందరు వరదలో కూడా ఇసుకను ట్రాక్టర్లతో యథేచ్ఛగా రవాణాచేస్తున్నారు. సోమవారం రాత్రి పోలీసులకు అందిన సమాచారం మేరకు సిబ్బంది అలజంగి చేరుకుని అక్రమంగా ఇసును తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద హాజరు పరచగా,పది వేలు రూపాయలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

నిమజ్జనంలో జాగ్రత్త వహించాలి: తహసీల్దార్


వినాయక ప్రతిమల నిమజ్జనంపై చర్చిస్తున్న అధికారులు

బొబ్బిలి రూరల్: వినాయక ప్రతిమల నిమజ్జనంలో జాగ్రత్త వహించాలని తహసీల్దార్ ఎం.శ్రీను కోరారు. మంగళవారం బొబ్బిలిలో తహసీల్దార్ అధ్యక్షతన కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపీడీవో పి.రవికుమార్, పట్టణ ఈఐ సతీష్ కుమార్ వినాయక ప్రతిమల నిమజ్జనంపై చర్చించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టలని పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తెలిపారు.

అపశ్రుతి చోటుచేసుకోరాదు: సీఐ

రామభద్రపురం: వినాయక నిమజ్జనంలో ఎటువంటి అపశ్రుతి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మహిళాపోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వినాయక నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.గంజాయి అక్రమరవాణా, వినియోగంపై నిఘా పెట్టాలని తెలిపారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'ను వినియోగించుకోండి: ఎస్పీ

విజయనగరం క్రైం: ప్రజల ఆస్తులకు రక్షణ కవచంలా నిలుస్తున్న లాక్‌డ్ మోనటరింగ్ లాక్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఒకప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీల్లో నివసిస్తున్న ప్రజలకు ఉచితంగా మొబైల్ యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు అవసరాల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని, ఇంటి నుంచే తమ పేరు, ఫోన్ నెంబరు, లోకేషన్ తదితర వివరాలను యాప్‌లో నమోదుచేసి రిక్వస్ట్ పంపాలని తెలిపారు. తర్వాత మొబైల్ నెంబరుకు మేసేజ్ వస్తుందని, ఈ నెంబరునే యూజర్ ఐడీగా పొందవచ్చని పేర్కొన్నారు. రిక్వస్ట్ పంపిన తర్వాత సంబంధిత స్టేషన్ నుంచి పోలీసులు సీసీ కెమెరాను సందర్శించి, ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటుచేస్తారని తెలిపారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో


రాజాం రూరల్: మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

రాజాం రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు ఆదేశించారు. సోమవారం రాజాం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని యూపీహెచ్‌సీలో బుచ్చెంపేట అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు బొద్దాం, పొగిరి, సంతకవిటి, మండు వకురిటి, వంగర, అరసాడ, రేగిడి ఆముదాలవలస, బూరాడ పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. వైద్యులు, సిబ్బందితో కలిసి గ్రామా ల్లోని సందర్శించాలని, మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలతో పాటు డయేరియా ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నీటివనరుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 17న నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పీహెచ్‌సీల పరిధిలో శతశాతం పూర్తిచేయాలని కోరారు. కార్య క్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సూర్యనారాయణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్, కె.అనూష, కె.కృష్ణమోహన్, కె.చంద్రశేఖరరాజు, జె.సత్యరాజు పాల్గొన్నారు.

వంగర: రోగులకు మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. మంగళవారం వంగరలోని ఆరోగ్య కేంద్రంలో మందులు, రికార్డులు నిర్వహణతోపాటు సిబ్బంది విధులపై ఆరాతీశారు. సిబ్బంది సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వైద్యాధికారులు సాయంత్రం నాలుగు వరకు, మిగిలిన సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉండాలన్నారు.

● **రామభద్రపురం:** వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రమామణి సూచించారు. మంగళవారం రామభద్రపురంలో ఆరికతోట, రామభద్రపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఆరికతోట పీహెచ్‌సీ ఈవో మల్లీశ్వరరావు, రామభద్రపురం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

14న మెగా లోక్‌అదాలత్

శృంగవరపుకోట: ఈనెల 14న జరగనున్న మెగా లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు కక్షిదారులకు సూచించారు. ఎస్.కోటలో న్యాయవాదుల సంఘ సభ్యులు బి.సత్యనారాయణ, అప్పారావు, జి.ప్రకాశరావు, బి.రామకృష్ణతో సమావేశం నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండండి

- ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే సహాయక చర్యలు చేపట్టండి
- ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులకు హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశం
- విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వైపరీత్యాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల వాటిల్లిన నష్టం, తీసుకున్న సహాయ చర్యలపై విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం ఉదయం విశాఖ పట్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విజయవాడలో మాదిరిగా సహాయ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదే శించారు. వర్షాకాలంలో నీటి పారుదలశాఖ అధికారులతో జిల్లాలోని జలాశయాల స్థితిగతులపై కలెక్టర్లు సమీక్షిస్తుండాలని ఆదేశించారు. పనిచేయని, పాడైన రిజర్వాయర్ గేట్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. భారీవర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాలో ముంపు, పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడడమే కాకుండా, సహాయ చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు వారి బోట్లను కూడా వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపద మిత్ర బృందాలను ఏర్పాటుచేసి వారికి ప్రకృతి వైపరీత్యాలు సమయంలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనివల్ల ముందస్తు రక్షణ చర్యలకు అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో శాశ్వత టోల్‌ఫ్రీ, ల్యాండ్ లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల ఏడు, ఎనిమిది తేదీల్లో కురిసిన భారీవర్షాల వల్ల జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఎక్కడికక్కడ సహాయ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవోలు హుస్సేన్ సాహెబ్, పి.భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరా, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అనిత

సీబీఎం స్కూల్ స్థలంపై విచారణ


సీబీఎం పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొబ్బిలి: బొబ్బిలిలోని సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల స్థలంపై తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను మంగళవారం విచారణ నిర్వహించారు. స్కూల్ స్థలాన్ని అమ్మేశారు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో కలెక్టరు స్పందించి విచారణకు ఆదేశించారు. పాఠశాలలో హెచ్‌ఎం సునేత్రి, యాజమాన్య కమిటీకి చెందిన వైస్‌ఛైర్‌పర్సన్ శ్రీదేవి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఇదే స్థలంలో కొనసాగించాలని వారు కోరారు. పాఠశాల చరిత్ర, బైలా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నామని, అందరి అభిప్రాయాలను సేకరించామని, ప్రాథమిక నివేదికను జిల్లా కలెక్టరుకు సమర్పిస్తామని తహశీల్దార్ శ్రీను తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కళ్యాణచక్రవర్తి ఉన్నారు.

రేపు విశాఖలో జాబ్‌మేళా

విజయనగరం దాసన్నపేట: విశాఖలో గల కంచరపాలెం వద్ద ఉన్నప్రభుత్వ ఓల్డ్ ఐటీఐలో గురువారం అశోకా లైలాండ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆటో పెయింటర్ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 94401 97068, 98491 18075 నెంబరును సంప్రదించాలని కోరారు.

పాఠశాల పరిసరాలు పరిశీలన

జామి: మండలంలోని లోట్లపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని ఉన్న షామిల్లు యాజమాని వరద నీరును పాఠశాల ప్రాంగణం నుంచి విడిచిపెట్టడంతో బురదమయంగా మారుతోందని పాఠశాల కమిటీ ఛైర్మన్ గాజుల రమేష్ తెలిపారు. మంగళవారం పాఠశాల పరిసరాలను స్థానికులు జన్నెల బాలకృష్ణ, సిడగ వెంకటరావు, దాసరి సత్యంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బురద నేలపై కాలుజారితే విద్యార్థులు గాయపడతారని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా పాఠశాల ప్రాంగణం నుంచి నీరు వదలొద్దని కోరినా, సంబంధిత వ్యక్తి పట్టించుకోలేదని హెచ్‌ఎం నవీన్ తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వేపాడ: వేపాడ పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు స్త్రీ వైద్య నిపుణురాలు పణిశ్రీ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు బానాదికి చెందిన సత్యసాయి సేవాసమితి సభ్యులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


ఎమ్మెల్యే లలితకుమారితో మాట్లాడుతున్న మారిక గిరిజనులు

వేపాడ/లక్కవరపుకోట: మారిక గిరిజనుల సమస్యల ఎరిష్కారానికి చర్యలు చేపట్టాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదేశించారు. వేపాడ మండలంలోని మారిక గిరిశిఖర గ్రామం సమస్యల పరిష్కరించాలని జనసేన నాయకుడు సుంకరి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమ గ్రామానికి తారురోడ్డు కళగా మిగిలిందని తెలిపారు. ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని, పోడు వ్యవసాయానికి రాయితీపై రుణాలు మంజూరు చేయించాలని సాగు చేసే భూములకు పోడు పట్టాలను మంజూరు చేయించాలని కోరారు. దీంతో లలితకుమారి అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం, కొళాయిలు ఏర్పాటు తదితర సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గిరిజనులకు ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం: కమిషనర్

బొబ్బిలి: బొబ్బిలిలోని ఇందిరమ్మనాయుడుకాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తామని మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. మంగళవారం కాలనీలోని పలువీధుల్లో వర్షాలకు బురద, వరదనీటితో రోడ్లు, కాలువలు నిండిపోవడంతో పరిశీలించారు. కాలువల్లో మురుగు నీరు సక్రమంగా ప్రవహించేలా క్లియర్ చేయాలని సిబ్బందిని కోరారు. ఖాళీ స్థలాల్లో నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని పలువురు కమిషనర్‌ను కోరగా, ఆమె సంబంధి త యజమానులకు నోటీసులు జారీచేయాలని ఆదేశించారు.

నివాసమున్న చోటే పట్టాలివ్వాలి

- సీపీఎం విజయనగరం కార్యదర్శి రెడ్డి శంకరరావు

విజయనగరం దాసన్నపేట: నివాసమున్న చోటే పట్టాలిచ్చి ఇళ్లు కట్టేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నగరకార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. మంగళవారం విజయనగరం ఎల్‌బీజీనగర్‌లో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ,సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని తెలిపారు.ధరలు విపరీతంగా పెరిగాయని, రాష్ట్రాల హక్కులు కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.ఎల్‌బీజీనగర్ చుట్టూ ఉన్న నాలుగు కాలనీలు కలిపి అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని కోరారు.కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, రమణ, కృష్ణమ్మ, పుణ్యవతి పాల్గొన్నారు.

ఆరో తేదీ నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

విజయనగరం రూరల్: విజయనగరంలోని పూల్‌బాగ్ రోడ్డుగల జగన్నాథకల్యాణ మండపంలో ఏపీటీఎఫ్ (1938) సంఘం రాష్ట్ర మహాసభలు అక్టోబరు ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకూ జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి చెప్పారు. మంగళవారం విజయనగరంలో సంఘ జిల్లా నాయకులు ఎ.సదాశివరావు, డి.ఈశ్వరరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.విద్యారంగంలో శాస్త్రీయ, నైతిక విలువలతో కూడిన విద్యవిధానం అమలు కోసం ప్రభుత్వాలతో తమ సంఘం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు. సదాశివరావు, ఈశ్వరరావు మాట్లాడుతూ అక్టోబరు ఆరో తేదీ నుంచి జరగనున్న రాష్ట్ర సదస్సుకు 26 జిల్లాల నుంచి ఏపీటీఎఫ్ ప్రతినిధులతో పాటు, విద్యా రంగ నిపుణులు, మేధావులు తరలిరానున్నారని తెలిపారు.


మాట్లాడుతున్న చిరంజీవి

కొలిక్కిరాని అలమండ సంత రెన్యువల్


సంత కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జామి: మండలంలోని లోట్లపల్లి(అలమండ)పశువుల సంత లైసెన్స్ రెన్యువల్ కొలిక్కి రావడంలేదు. ఇప్పటికే రెండుసార్లు సంతకు అనుమతి ఇచ్చేందుకు ఈవోపీఆర్డీ శ్రీదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినా అధికారులు రాకపోవడంతో వాయిదాపడిన విషయం విదితమే. మంగళవారం మరోసారి లోట్లపల్లి సచివాలయంలో సంత అనుమతి కమిటీ సమావేశం ఈవోపీఆర్‌డీ ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేశారు. తొలుత సంత అనుమతులు ఏ విధంగా ఉండాలో గోసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ వివరించారు. సంత యాజమాని రాజు మాట్లాడుతూ ఇన్ని నిబంధనలతో సంతను నడపలేమని పేర్కొన్నారు. తహసీల్దార్ కృష్ణలత మాట్లాడుతూ అందరి అధికారుల సంతకాలు పూర్తయ్యాక తన వద్దకు ఫైల్ పంపించాలని కోరారు. కాగి పూర్తిస్థాయిలో అధికారులు రాకపోవడంతో ఈనెల 17కు వాయిదా వేస్తున్నట్లు ఈవోపీఆర్డీ ప్రకటించారు.

స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్

విజయనగరం దాసన్నపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశాఖ ఉక్కుకు గనులు కేటాయించాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తొమ్మిది వేల కోట్లు పెట్టుబడికి 55 వేల కోట్ల డివిడెండ్‌ను చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. నష్టాల్లోకి విశాఖ ఉక్కుని నెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, టీవీ రమణ, సుధారాణి, సూర్యనారాయణ, రమణ, రాంబాబు, రాజు, నాయుడు, గోవింద, శ్యామ్ పాల్గొన్నారు.


ఆర్టీసీకాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

జీవో నెం.85ను రద్దు చేయాలి

● నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన వైద్యులు

జీవో నెంబరు 85ను రద్దు చేయాలని జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబరు 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. గత రెండు నెలలుగా జీవో రద్దు చేయాలని అధికారులకు, ఎమ్మెల్యేలకు విన్నవించుకున్నా ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని తెలిపారు. కరోనా సమయంలో జీవితాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందించామని, అయినా జీవో 85 ద్వారా పీజీ సీట్లలో ఇన్ సర్వీస్ కోటా తగ్గించడం అన్యాయమన్నారు. ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


సీతంపేట రూరల్: నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు


కురుపాం రూరల్: మొండెంఖల్‌లో..


వీరఘట్టం పీహెచ్‌సీలో..


సాలూరు రూరల్: మామిడిపల్లిలో..


జియ్యమ్మవలస పీహెచ్‌సీలో..

ఏకలవ్య నూతన భవనాన్ని పది రోజుల్లో అప్పగించాలి

● ఐటీడీఏ పీవో యశ్వంత్‌రెడ్డి

భామిని: భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను పది రోజుల్లో పూర్తి చేసి యాజమాన్యానికి అప్పగించాలని సీతంపేట ఐటీడీఏ పీవో ఎస్.యశ్వంత్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏకలవ్య విద్యార్థులకు తప్పని అవస్థలు శీర్షికన వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తకు ఆయన స్పందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భామిని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనం నిర్మాణంలో ఉండడం వల్ల ఆ పాఠశాలలో ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 116 మంది విద్యార్థులను తాత్కాలికంగా సీతంపేట మండలంలోని మల్లి గురుకుల పాఠశాలలో వసతి ఏర్పాటు చేసి బోధిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఉన్న వసతిగృహ గదులు వర్షాలకు కారిపోతుండడం వల్ల ఆ పాఠశాలలను సందర్శించామని, అక్కడ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశామని చెప్పారు.

విద్యార్థుల సమస్య పరిష్కారానికి చర్యలు

సీతంపేట: మల్లి ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని డీడీ అన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భామినిలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనంలోకి విద్యార్థులందరికీ పంపించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి అపోహలు అవసరం లేదని, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు అవసరమైన భవనాలను పూర్తిస్థాయిలో సమకూర్చడానికి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. ఇప్పటికే కలెక్టర్ శ్యాంప్రసాద్, ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఏకలవ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారని ఆయన తెలిపారు. ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులను తల్లిదండ్రులు తిరిగి పాఠశాలకు పంపించాలని, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన చెప్పారు.

నాగావళిలో పెరుగుతున్న వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ప్రవాహం అధికంగా వస్తోంది. మంగళవారం ఉదయం నుంచి నదిలోకి పైనుంచి ప్రవాహం చేరుతోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో 10,853 క్యూసెక్కులు, 3 గంటలకు 14,268 క్యూసెక్కులు, 4 గంటలకు 3,160 క్యూసెక్కుల వరద నెలకొంది. ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 104.04 మీటర్లు, అలాగే 2.534 టీఎంసీలకుగాను 1.920 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉంది. అనూహ్యంగా వరద ప్రవాహం చేరడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నా తక్కువ స్థాయిలో వరద ప్రవాహం ప్రాజెక్టులో చేరింది. అయితే పైప్రాంతాల్లో వర్షాలు కురవడంతో ఊహించిన రీతిలో 15 వేలకు పైబడి వరద ప్రవాహం చేరింది. అలాగే ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువ నుంచి 490 క్యూసెక్కులు నీరు సరఫరా చేస్తున్నారు. అధికంగా వరద ప్రవాహం చేరినా దిగువకు మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలో సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు.

ముంపు ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

కొమరాడ / జియ్యమ్మవలస: కొమరాడ మండలంలో ముంపు ప్రాంతమైన కళ్లికోట గ్రామంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పర్యటించారు. ముంపునకు కారణాలేమిటని గ్రామస్థులను ఆరా తీశారు. అయితే గ్రామ సమీపంలో కరకట్ట వద్ద తూము నిర్మాణం చేపడితే గ్రామానికి ముంపు భయం ఉండదని బదులిచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి తూము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తర్వాత వరద ఉధృతి ఉంటే ఎవరూ నదీ ప్రవాహం వైపు వెళ్లవద్దని గ్రామస్థులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శేఖరపాత్రుడు, సీనియర్ నాయకులు పి.వెంకటనాయుడు, జనసేన కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.


తూము కట్టాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వరద కాలువలోకి నీరు తరలింపు

భామిని: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల భామిని మండలానికి వర్షాలు కురవకపోయినప్పటికీ మంగళవారం ఉదయం హఠాత్తుగా వంశధారలో నీరు పెరిగింది. సమాచారం తెలుసుకున్న వంశధార అధికారులు ఏడు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని వరద కాలువలో తరలించారు. వంశధారలో 11 వేల క్యూసెక్కులు మూడు గంటలసేపు ప్రవహించిందని వంశధార డీఈ భవానీశంకర్ తెలిపారు. కొద్దిపాటి నీటిని కాలువలోకి తరలించామని చెప్పారు. నీరు పెరగడంతో ఎక్కడ పడవలు అక్కడే నిలిచిపోయాయన్నారు.


వరద కాలువలోకి నీరు తరలిస్తున్న దృశ్యం

విరామం ఇచ్చిన వర్షం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మంగళవారం విరామం ఇచ్చాయి. దీంతో రైతులు తమ పంటలకు నష్టం లేకుండా వర్షాలు ఆగాయని ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలు వల్ల జిల్లాలోని రహదారులకు భారీగా నష్టం ఏర్పడింది. మక్కువ మండలంలో శంబర, చెముడు తదితర ప్రాంతాల్లో సుమారు 20 ఎకరాల అరటి పంటకు నష్టం ఏర్పడింది.

నేలకొరిగిన మొక్కజొన్న

సాలూరు రూరల్: ముచ్చర్లవలస గ్రామంలోని మొక్కజొన్న పంట ఇటీవల వర్షాలకు నేలకొరిగింది. పంట చేతికొచ్చే తరుణంలో ఇలా నేలకొరిగిందని మహిళా రైతు రేజేటి లక్ష్మి మంగళవారం విలేకర్ల ఎదుట వాపోయింది. అలాగే వర్షాల కారణంగా తమ పత్తి పంట ఊటపట్టి ఎదుగుదల నిలిచిపోయిందని రైతులు పాముల లక్ష్మి, మాలి జయరాజ్ వాపోయారు. ఇదిలాఉండగా ప్రస్తుత వర్షాల వల్ల మండలంలో ఏ పంటలకు నష్టం వాటిల్లలేదని మండల వ్యవసాయాధికారి అనురాధ పండా తెలిపారు.


నేలకొరిగిన మొక్కజొన్న పంట

వరద బాధితులకు విరాళాల సేకరణ

పాలకొండ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పాలకొండ పట్టణంలో మంగళవారం విరాళాలు సేకరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సహాయ కార్యదర్శి తోట జీవన్న, సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.సూరయ్య, సమితి సభ్యులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

● **గుమ్మలక్ష్మీపురం:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీడీపీ అరకు నియోజకవర్గ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే జగదీశ్వరికి మంగళవారం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: పి.ఆమిటి క్లస్టర్‌లోని వంజరాపుగూడ, మండ, మొరమగూడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలను జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు మంగళవారం పరిశీలించారు. అలాగే పి.ఆమిటి పంచాయతీలో వంజరాపుగూడ గ్రామంలో పండ్ల జాతులు, కాయగూరలు, ఆకుకూరల పంటలు పరిశీలించారు. రైతులకు నీమాస్త్రం తయారీపై వివరించారు. అనంతరం మొరముగూడలో బిడ్డిక సురేష్ అనే రైతు మామిడితోటలో ప్రకృతి పద్ధతిలో సాగు చేస్తున్న రాగి తోటను పరిశీలించారు. ఎమ్‌టీ నిర్మలాదేవి, హెచ్‌ఎస్‌ఎంటీ గౌరి, ప్రసాద్, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవరచుకోండి

సాలూరు రూరల్: చదువులో పోటీతత్వం అలవరచుకోవాలని సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ సూచించారు. మంగళవారం మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలలో కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరిగిన నేపథ్యంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ కనకల రమణమ్మ, వైస్ చైర్మన్ శ్రీనివాస్ దేవ్, గ్రామపెద్దల సమక్షంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో తుంటరి పనులకు, విధ్వంసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి

బెలగాం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ నాయకుడు తులసీరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ, రాము, ఇందిరా, సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై కేసులు

సీతంపేట రూరల్: అధిక లోడుతో ప్రయాణిస్తున్న ముగ్గురు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. మంగళవారం వాహన తనిఖీల్లో భాగంగా అధిక లోడుతో వెళుతున్న ఈ ఆటోలను గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పారిశుధ్యంపై అలసత్వం తగదు

గరుగుబిల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు హెచ్చరించారు. ఉద్దవోలు, దళాయివలస పంచాయతీలను వీరు మంగళవారం పరిశీలించారు. మురుగు నిల్వలు నెలకొనకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: ఎస్పీ

బెలగాం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల సైబర్ క్రైంకి వచ్చిన ఫిర్యాదుపై చర్యలు చేపట్టి బాధితురాలికి తిరిగి నగదు ఇప్పించినట్టు తెలిపారు. భామిని మండలం కొరమ గ్రామానికి చెందిన దుల్లాపు రమణమ్మ సైబర్ వలలో పడి రూ.2,81,919లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా సైబర్ నేరస్థుడిపై నిఘా ఉంచి రూ.1,81,919లు ఉన్న ఖాతాను హోల్డ్ చేశామని వెల్లడించారు. అనంతరం ఆ నగదును బాధితురాలి ఖాతాకు జమ చేయించినట్టు చెప్పారు.

● **గరుగుబిల్లి:** గ్రామాల్లో ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. వల్లరిగుడబ, చినగుడబ, ఉద్దవోలు, తదితర గ్రామాల్లో ఆయన మంగళవారం అవగాహన కల్పించారు.

గుమ్మగెడ్డ రిజర్వాయర్ పరిశీలన

సీతంపేట రూరల్: గొయిది గ్రామ సమీపంలో ఉన్న గుమ్మగెడ్డ రిజర్వాయర్‌ను ఎంపీడీవో గీతాంజలి, ఇరిగేషన్ డీఈ నారాయణరావు, ఎస్‌ఐ జగదీష్ నాయుడు మంగళవారం పరిశీలించారు. గుమ్మగెడ్డ రిజర్వాయర్ కుండీకి గండి అనే వార్త మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. రిజర్వాయర్ కుండీ వద్ద పడిన గండిని గిరిజన రైతులతో కలిసి పరిశీలించారు. కుండీ వద్ద పడిన గండిని పూడ్చి రిజర్వాయర్ గట్టు ఎత్తు పెంచాలని ఆయకట్టు రైతులు కోరారు. దీనిపై అంచనాలు వేసి పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

గురుకుల పాఠశాల సందర్శన

సీతంపేట రూరల్: సీతంపేటలోని ఏపీఆర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను ఎంపీడీవో గీతాంజలి, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, ఎంఈవో ఆనందరావు మంగళవారం సందర్శించారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ కళాశాల ప్రాంగణంలోకి వర్షపునీరు చేరింది. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈనేపథ్యంలో అధికారులు ఈ కళాశాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు పిలిపించి వర్షంనీరు కళాశాల ప్రాంగణంలోకి రాకుండా చూడాలని సూచించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు పనులకు సంబంధించి అంచనాలు వేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

లింగ వివక్షను అరికట్టాలి

భామిని: లింగ వివక్ష ఆధారంగా జరిగే హింసను అరికట్టేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సీమేక్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య అన్నారు. మంగళవారం భామిని ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత విద్యా విధానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే బాలబాలికలకు క్రమశిక్షణ నేర్పాలన్నారు. డ్రాపౌట్‌పై మండల అధికారులు దృష్టి సారించాలన్నారు. వెనుకబడిన భామిని మండలాన్ని అగ్రపథంలో నిలపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో పగడాలమ్మ, సీమేక్ ప్రొఫెసర్ శారద, నాగమ్మ, శ్రీనివాసరావు, ఆర్.శివకుమార్, విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మండల సమాఖ్య నాయకులు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వెలుగు కార్యాలయంలో ఉన్న కొన్ని సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.చిలకమ్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.ఊర్వశి, కోశాధికారి శోభారాణి తదితరులు ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.టి.శ్రీవరం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దరఖాస్తులు చేసే అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్‌లో కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. అరులైన అభ్యర్థులు ఈనెల 12లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 13వ తేదీన కళాశాలలో నిర్వహించే డెమోలో పాల్గొనాలన్నారు. ఏపీ స్లెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

గర్భిణులకు అన్నసమారాధన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం గర్భిణులకు అన్నసమారాధన నిర్వహించారు. పీఎంఎస్ ఎంఏ పథకం కింద ప్రతి నెల 9వ తేదీన స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు బురదవెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శివున్నాయుడు, గౌరమ్మ, బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు సహకారంతో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ఒడిశా

● కలెక్టర్ పారుల్ పట్వారి

రాయగడ: కాశీపూర్ సమితి కార్యాలయంలో కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 102 మంది అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. వాటిని పరిశీలించిన కలెక్టర్.. పదిమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. 8 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.8లక్షల 50వేలు అందజేశారు. మిగతా అర్జీలను వెంటనే పరిష్కరించవలసిందిగా ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సమితిలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ హారీష్ బీసీ, జిల్లా ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, జిల్లా విద్యాధికారి బసంతకుమార్ నాయక్, సంక్షేమ అధికారి భరత్ భూషణ్ బిస్వాల్ పాల్గొన్నారు.

జిల్లా సాంస్కృతిక భవనం సందర్శన

రాయగడ: రాయగడలోని సాంస్కృతిక భవనాన్ని కలెక్టర్ పారుల్ పట్వార్ మంగళవారం సందర్శించారు. సంస్కృత భవన్‌లో నడుస్తున్న డీఐపీఆర్వో నూతన కార్యాలయంతో పాటు పలు కార్యాలయాల కోసం భవన్ వెనుకఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. పలు కార్యాలయాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు అధికారులతో చర్చించారు. డీఐపీఆర్వో బసంతకుమార్ ప్రధాన్, సాంస్కృతిక అధికారి సుష్మిత బౌరి రోడ్డు, భవనాల శాఖ జూనియర్ ఇంజినీర్, తదితర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా..

సబ్ కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



పాలకొండ: సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు మంగళవారం కలిశారు. తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా నగర పంచాయతీకి వేధిస్తున్న డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. నగర పంచాయతీలోని పలు సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

తోణాంలో జ్వరాలపై సర్వే

సాలూరు రూరల్: తోణాం గ్రామంలో జ్వరాలు విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుజాత స్పందించారు. వైద్య సిబ్బందితో గ్రామంలో ఇంటింటి సర్వే చేయించారు. దిప్పలపాడు, పూతికవలసల్లో కూడా ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 16 మంది జ్వరపీడితులను గుర్తించి, చికిత్స అందించామని ఆమె తెలిపారు.

పారిశుధ్య పనులు

తోణాం గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించినట్టు ఈవో పీఆర్డీ ప్రసాద్ చెప్పారు. తోణాంతో పాటు దిప్పలపాడు, పూతికవలసల్లో పారిశుధ్య పనులు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

జిల్లాలో తర్ల్ బేస్ లైన్ టెస్ట్

సాలూరు రూరల్: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో తర్ల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవెల్) బేస్ లైన్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు టెస్టింగ్ టూల్స్‌ను ఎంఈవో కార్యాలయ గ్రూపుల్లో ఉంచారు. ఈ టెస్ట్‌ను బుధవారం కూడా నిర్వహించనున్నారు. జిల్లాలో 12 వందలకు పైగా పాఠశాలల్లో ఈ టెస్ట్‌ను నిర్వహించారు.

కొత్త స్విచ్ బోర్డు వచ్చింది

సాలూరు రూరల్: కాకుడువలస తాగునీటి ట్యాంకు మోటారు ఆన్ చేయడానికి మంగళవారం కొత్త స్విచ్ బోర్డును ఏర్పాటు చేశారు. మోటార్ ఆన్ చేసేందుకు గిరిజనులు సాహసం చేస్తున్న విషయమై మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఈవోపీఆర్డీ ప్రసాద్ తక్షణమే స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో కొత్త స్విచ్‌బోర్డును ఏర్పాటు చేశారు.

లక్షపత్రి పూజలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని కూరాకులవీధిలో మంగళవారం సిద్ధి వినాయక పంచాహిణిత మహోత్సవం సందర్భంగా శ్రీకృష్ణసేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మంగళవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 108 జంటలు హాజరయ్యాయి. గత 80 ఏళ్ల నుంచి ఈ కార్యక్రమం సిద్ధి వినాయక మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.


లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు